క్లుప్తంగా

విత్తన శుద్ధితో తెగుళ్లు మాయం



చొల్లంగిలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రశాంతి

తాళ్లరేవు: విత్తన శుద్ధి చేసి వరిపంట సాగుచేస్తే తెగుళ్లను అరికట్టవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి తెలిపారు. చొల్లంగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రశాంతి మాట్లాడుతూ వరిలో కేజీ విత్తనాలకు 8 గ్రా పొడి సుడోమోనస్ ఫ్లోరిసెన్స్, శిలీంద్ర, బ్యాక్టీరియా నాసినితో విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ల బారి నుంచి గట్టెక్కవచ్చన్నారు. ఈ విధానం వల్ల పెట్టుబడి తగ్గించి నాణ్యమైన అధిక దిగుబడిని పొందవచ్చని తెలిపారు. రైతులందరూ పొలం బడి కార్యక్రమంలో పాల్గొని అన్ని రకాల సాగులపై అవగాహన పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు గుత్తుల నరసింహ మూర్తి, గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకట రమణ, రైతులు పాల్గొన్నారు.

రక్త పింజర హతం



ఉప్పలగుప్తంలో సిబ్బంది హతమార్చిన పాము

ఉప్పలగుప్తం: స్థానిక సబ్‌స్టేషన్‌లో శుక్రవారం రక్త పింజర పాము హల్‌చల్ చేసింది. పామును చూసి భయభ్రాంతులకు గురైన సిబ్బంది దానిని హతమార్చారు. సబ్‌స్టేషన్ రక్తపింజర పిల్లలు తిరుగుతున్నాయని తెలిపారు. ఈ పాము చాలా విషపూరితమైందని, అది కాటు వేస్తే మనిషి క్షణాల్లో మరణిస్తారని నిపుణులు చెప్తున్నారు.

గురుకుల పాఠశాలకు వంట సామగ్రి బహూకరణ



ప్రిన్సిపాల్ గంగాభవానీకి వంట సామగ్రి అందజేస్తున్న దాత

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలకు సుమారు రూ.10వేలు విలువ చేసే వంట సామగ్రిని బహూకరించారు. ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన వీధి చంటిబాబు వంట సామగ్రి, గోడ గడియారం సమకూర్చారు. వీటిని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ టి.గంగాభవానీకి అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ వడి శ్యామ్‌ప్రసాద్, అధ్యాపకులు పద్మవాణి, ప్రశాంతి, వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు సత్కారం



ధర్మారావు దంపతులను సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

ముమ్మిడివరం: ప్రముఖ అంబేడ్కరీయుడు, బౌద్ధ ఉపాసిక, ఇటీవల ఆర్టీసీ ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన నిమ్మితి ధర్మారావును మండల బీఎస్‌ఐ ఘనంగా సత్కరించింది. అయినాపురం నీలం వారిపేటలో శుక్రవారం బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా మండల శాఖ సమావేశం ఆ శాఖ నాయకుడు తిరుకోటి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉపాసిక శరత్ మాట్లాడుతూ ఈనెల 17న అమలాపురంలో అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఆర్‌పీఐ మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య 90వ జయంతిని బౌద్ధులు, అంబేడ్కరీయులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలిత ధర్మారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాసిక కాశి సింహద్రివర్య, కాశి మూర్తి, మచ్చా హరికుమార్, చిరంజీవి, గెద్దం వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల యజమానులకు నోటీసులు

పశువులను బంధించి గోశాలకు అప్పగిస్తాం
మున్సిపల్ కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: పట్టణంలో పశువులు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండడంతో వాటి యజమానులకు నోటీసులు ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. నోటీసుల జారీ చేసినా యాజమానులు తమ పశువులను ఏ మాత్రం కట్టడి చేయకుండా ఎప్పటిలాగే రోడ్లపై వదిలేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పశువులను కట్టడి చేయకుంటే వాటిని బంధించి గోశాలకు తరలిస్తామని తెలిపారు. సంబంధిత పశువుల యాజమానులపై చట్టపరమైన చర్యలకు కూడా ఉపక్రమిస్తామని కమిషనర్ మనోహర్ స్పష్టం చేశారు.

నిబంధనలకు నీళ్లు

- పట్టణ ప్రణాళిక నిబంధనలు అతిక్రమణ
- అనుమతుల్లేకుండా అదనపు కట్టడాలు
- అమలాపురం పట్టణంలో జోరుగా పెంటహౌస్ నిర్మాణాలు



అమలాపురం పట్టణం వడ్డిగూడెంలో ఓ అపార్ట్‌మెంట్ అనుమతి లేకుండా నిర్మించిన పెంట్ హౌస్

అమలాపురం టౌన్: పట్టణంలో నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం నుంచి కొన్ని భవనాల నిర్మాణాలకు తీసుకుంటున్న అనుమతులు 95 శాతం సక్రమంగా సాగినా మిగిలిన 5 శాతం పనులు అతిక్రమణ గురవుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల నిర్మితమైన, నిర్మితమవుతున్న కొన్ని అపార్ట్‌మెంట్లకు పట్టణ ప్రణాళిక విభాగం నుంచి తీసుకుంటున్న అనుమతులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అపార్ట్‌మెంట్లు జీ+ 3,4,5 వరకూ అధికారికంగా అనుమతులు తీసుకుంటున్నారు. అక్కడి వరకూ బిల్డర్లు అపార్ట్‌మెంట్లను సక్రమంగానే నిర్మిస్తున్నా అయిదో అంతస్తులపై పెంట్ హౌస్‌ల పేరుతో నిర్మిస్తున్న కట్టడాలకు అనుమతులు ఉండడం లేదు. ఎందుకంటే అమలాపురం పట్టణానికి సంబంధించి ఆరో అంతస్తుకు అనుమతులు ఉండవు. టౌన్ కంట్రీ ప్లానింగ్ నిబంధనలు అందుకు అంగీకరించవు. ఇది అమలాపురం పట్టణ వైశాల్యం. ఇళ్ల సంఖ్య (ఎసెస్‌మెంట్స్), పట్టణ జనాభాను బట్టి కొన్ని పరిమితులతో కూడిన ఆంక్షలు ఉన్నాయి.

పెంట్ హౌస్‌కి అనుమతి లేదు

పట్టణంలో కొన్ని అపార్ట్‌మెంట్ల బిల్డర్స్ 5 అంతస్తులకే అనుమతులు తీసుకుంటున్నారు తప్ప పెంట్‌హౌస్‌కి అనుమతులు ఇవ్వకపోవడంతో అతిక్రమణలు అనివార్యమవుతోంది. ఉదాహరణకు పట్టణంలోని వడ్డిగూడెంలో నిర్మితమైన అయిదు ఫ్లోర్ల అపార్ట్‌మెంట్‌కు అనుమతులు బాగానే ఉన్నా పెంట్ హౌస్ పేరుతో దాదాపు నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న రెండు గదులకు మాత్రం అనుమతులు లేవు. పట్టణం హోదాను బట్టి అయిదో అంతస్తుపై పెంట్ హౌస్ నిర్మాణానికి అనుమతులు లేదు. కానీ నిర్మించారు. ఈ తరహా అతిక్రమణలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నిరంతర పర్యవేక్షణ లేక..

పట్టణంలో పలు అపార్ట్‌మెంట్లపైనే కాకుండా భారీ భవనాల నిర్మాణాల్లోనూ ఇదే మాదిరి నిబంధనల ఉల్లంఘన జరుగుతోంది. కొన్ని రాజకీయ ఒత్తిళ్లతో, మరికొన్ని మామూళ్లతో నిబంధనలకు నీళు వదులుతున్నారు. ప్రజల నుంచి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పుడు, కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు వచ్చినప్పుడు ఇలాంటి అతిక్రమణలపై అధికారులు నిబంధనల కొరడా ఝళిపిస్తున్నారు. తర్వాత పట్టించుకోవడంలేదు. నిరంతర పర్యవేక్షణ లేకుంటే అక్రమ నిర్మాణాల దందా కొనసాగుతూనే ఉంటుంది.

అతిక్రమణపై ఫిర్యాదు

వడ్డిగూడెంలోని అపార్ట్‌మెంట్ పెంట్ హౌస్ నిర్మాణ అతిక్రమణపై కొందరు ఫిర్యాదు చేయడంతో పట్టణ ప్రణాళిక అధికారుల, సిబ్బంది స్పందించారు. ఆ అపార్ట్‌మెంట్ బిల్డర్‌పై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక పట్టణాన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం దశల వారీగా ప్రణాళికా బద్ధంగా జరిగాల్సిన అభివృద్ధి విషయంలో ఇలాంటి అతిక్రమణ నిర్మాణాలు కొంత అవరోధం అవుతాయి. ఈ వాస్తవాన్ని నూటికి నూరు శాతం పట్టణ ప్రణాళిక గుర్తించి అమలు చేసిన నాడే మాస్టర్ ప్లాన్ సెక్సెస్ అవుతుంది.

> **ఆ బిల్డర్‌కు నోటీసులు ఇచ్చాం**
>
> పట్టణంలోని వడ్డిగూడెంలో ఓ అపార్ట్‌మెంట్ పెంట్ హౌస్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విషయం పట్టణ ప్రణాళిక విభాగం దృష్టికి వచ్చింది. అనుమతులు అతిక్రమించిన ఆ బిల్డర్‌కు ఇప్పటికే మున్సిపాలిటీ నుంచి నోటీసులు జారీ చేశాం. ఛార్జిషీటు కూడా ఫైల్ చేసి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో కూడా పెట్టాం.
>
> – తేజోమూర్తి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, పట్టణ ప్రణాళిక విభాగం, అమలాపురం మున్సిపాలిటీ

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేసిన దాతను సత్కరించిన ఆలయ అధికారులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం భక్తురాలు రూ.లక్ష విరాళం అందజేశారు. కాకినాడకు చెందిన వల్లూరి సుమిత్ర రూ.లక్ష నగదును ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. అనంతరం దాతకు అర్చకులు దత్తుశర్మ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు





తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ని కలిసిన సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు, హరికృష్ణవర్మ తదితరులు

ఉప్పలగుప్తం: తాడేపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పలగుప్తం మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నేలపూడి సుగంధ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు పందిరి సుబ్బరాజు, దంగేటి సుబ్రహ్మణ్యం, గుత్తుల సత్తిబాబు, నేరేడుమిల్లి శ్రీనివాసరావులను పరిచయం చేశారు.

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలానికి చెందిన చింతా హరికృష్ణవర్మ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారితోపాటు చింతా శివప్రసాద్, ఏడిద నాగేశ్వరరావు, కొల్లు గౌతమ్ ఉన్నారు. అమరావతిలో జూపూడి ప్రభాకరరావుని వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పచ్చిమాల శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు.

సూర్య బలిజ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన పట్టణ సూర్య బలిజ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న పట్టణ సూర్య బలిజ సంఘం ప్రతినిధులు స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు మద్దుల రవి నాగేశ్వరరావు, గౌరవ సలహాదారుడు మద్దుల గోపాలకృష్ణ నూతన కార్యవర్గ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘ నూతన అధ్యక్షుడిగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ భాస్కర్ల రామకృష్ణ, సంఘం కార్యవర్గానికి నూతనంగా ఎన్నికైన ప్రతినిధులంతా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా సంఘ అధికార ప్రతినిధి కాశే వెంకటరత్నం, సంఘ పెద్దలు వైకే అంజిబాబు (చెన్నై), మద్దుల కాసుబాబు, కోటిపల్లి రత్నమాల అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సూర్య బలిజీలను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చి రిజర్వేషన్‌ను వర్తింప చేయాలని నూతన కార్యవర్గం ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి జిల్లాలో ఇచ్చే నామినేటెడ్ పదవుల్లో సూర్య బలిజలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాశే సురేష్, పందిరి శ్రీనివాస్, ధరణికోట శ్రీనివాసరావు, యండమూరి శివకేశవ, కాశే వెంకన్న, సరిదే రామరాజు తదితరులు పాల్గొన్నారు. చివరిగా నూతన కార్యవర్గ ప్రతినిధులను తోటి సంఘీయులు పూల మాలలతో సత్కరించి అభినందించారు.

ట్రిపుల్ ఐటీకీ విద్యార్థుల ఎంపిక



ఎస్.తపశ్విని



వి.రుషిక



డి.రామహారిక



పినపోతు ఈషిత



బీఎస్ఎస్ రత్నశ్రీ



ఎస్‌పీ లక్ష్మీదుర్గ

తాళ్లరేవు: నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం రాధాకృష్ణ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి 2024–25 సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారన్నారు. వీరిలో ఎస్.తపశ్విని(శ్రీకాకుళం), వి.రుషిక(ఒంగోలు), డి.రామహారిక(ఒంగోలు)లో సీట్లు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, హెచ్ఎం రాధాకృష్ణతోపాటు స్కూల్ కమిటీ ప్రతినిధులు, నాయకులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

అల్లవరం: మండలంలోని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులు నూజివీడు, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైయ్యారని ఎంఈఓ–2 ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ఓడలరేవు ఉన్నత పాఠశాలకు చెందిన పినపోతు ఈషితకు నూజివీడులో సీటు లభించింది. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన బీఎస్ఎస్ రత్నశ్రీ, ఎస్‌పీ లక్ష్మీ దుర్గలకు ఒంగోలులో సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ కిరణ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు కేఎస్ఆర్ మూర్తి, ఎంఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

14న నర్సింగ్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్ల పూర్తి



రాజీవ్‌గాంధీ హైస్కూల్ పరీక్షాకేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 14న యానాంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి విలేకరులకు తెలిపారు. సెంటాక్ ద్వారా ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకి నిర్వహించే ఈ పరీక్షకు స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో పరీక్షా కేంద్రంగా కేటాయించారన్నారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. యానాం నుంచి 62 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే హాలు టికెట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా తమ ఫొటో, సంతకాన్ని నిర్దేశిత బాక్సులో అతికించాలని, ఆధార్ తదితర ఏదైన ఒక గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.

ఫ్రైడే డేను డ్రై డేగా పాటించాలి



30వ వార్డులో ప్లాస్టిక్ డబ్బాల్లో ఉన్న నిల్వ నీటిని పారబోస్తున్న శానిటేషన్ సిబ్బంది



విలసవిల్లి రంగా సెంటర్‌లో చెత్తను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

అమలాపురం టౌన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు, డయేరియా వంటి రుగ్మతలను పూర్తిగా నివారించేందుకు పట్టణ ప్రజలు తమ ఇళ్ల వద్దే ప్రతి ఫ్రైడ్‌ను డ్రై డేగా పాటించాలని మున్సిపాలిటీ, వార్డు సెచివాలయాల శానిటేషన్ సిబ్బంది సూచించారు. శుక్రవారం పట్టణంలోని 30వ వార్డులో శానిటేషన్ సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇళ్ల ఆవరణలో ఉన్న పూల కుండీలు, రుబ్బురోలు, వాడి పాడేసిన కొబ్బరి బొండాలు, వాడకుండా ఉన్న ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిల్వ ఉంటే అది దోమలకు నిలయంగా మారి వ్యాధులకు కారణమవుతాయని వివరించారు. శానిటేషన్ సిబ్బందే అలాంటి నీటి నిల్వ ఉన్న వస్తువులు ఇళ్ల వద్ద గుర్తించి వాటిలో ఉన్న నీటిని ఒంపేశారు. పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ఎవరికి వారు తమ ఇళ్ల వద్ద వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సూచించారు. పట్టణంలో పరిసరాలు పరిశుభ్రత, డ్రైన్లను ఏ రోజుకా రోజు శుభ్ర పరిచే పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణ సాగుతోందని వివరించారు. ఇందుకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను, టాస్క్‌ఫోర్స్ టీమ్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ఉప్పలగుప్తం: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి, రోగాలబారి నుంచి బయటపడాలని విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. విలసవిల్లి గ్రామంలో అపారిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుక్రవారం శుభ్రం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజీ ఉన్నారు.

సీఎల్ఆర్‌లకు ఎంటీఎస్‌గా పదోన్నతి

యానాం: నియోజకవర్గపరిధిలో వివిధ శాఖల్లో ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబరర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి రెగ్యులర్ పద్ధతిన 29 మందికి మల్టీటాస్కింగ్ స్టాఫ్(సెక్యూరిటీ)గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. కె.ఆదినారాయణ, దామదరరావు, వి.కామరాజు, కె.సత్యనారాయణ, ఎ.శివకుమార్, ఎ.పెదవెంకన్న, దడాల దుర్గాబాలాజీ, ఉంద్రు ప్రభుదాస్, మద్దింశెట్టి యేసుబాబు, పెమ్మాడి శ్రీనివాస్, ఎస్.వీరబాబు, డి.తాతారావు, కాకి రాంబాబు, కె.సాయిబాబు, మల్లాడి సత్తిబాబు, రేఖాడి త్రినాథరావు, కె.శ్యామ్‌కుమార్, కె.అప్పారావు, కుక్కల బాల వెంకటరమణ, నూని వీరబాబు, వి.సత్యనారాయణ, మల్లాడి జయనారాయణ, కాయరాజు, ఇంగి ధర్మారావు, అంగాడి సీతారామరాజు, షేక్ అల్తాఫ్ వీరందరిని పుదుచ్చేరిలో నియమించారు. ముగ్గురు మహిళలను యానాంలో వివిధ శాఖల్లో నియమించారు.

పాఠశాలలో స్వచ్ఛభారత్

యానాం: పట్టణ పరిధిలో మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ స్కూల్‌లో శుక్రవారం సీఎస్ఎస్‌యూనిట్ వలంటీర్లతో మన బడి కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పైభాగంలో పేరుకుపోయిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వాటర్‌ట్యాంకును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, హెచ్ఎం రాజారామ్మోహన్‌రావు, పీఈటీ శేరు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఐ.పోలవరం: మురమళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అమలాపురం విద్యుత్ ఏఈ మోకా రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమరగిరి, మురమళ్ల, పశువుల్లంక, శేరుల్లంక, కొత్త మురమళ్ల గ్రామాలకు, కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం ఆక్వా చెరువులు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

తాగునీటి సమస్యపై ఫిర్యాదు

యానాం: తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ శివారు తీర ప్రాంత గ్రామమైన సావిత్రినగర్ వాసులు వాపోతున్నారు. శుక్రవారం సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆధ్వర్యంలో గ్రామ మహిళలు ఆర్ఏఓ మునిస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, ఇప్పటికైనా తాగునీరు సక్రమంగా అందించాలని కోరారు. అదేవిధంగా పిడబ్ల్యూడీ ఏఈఇ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

రైల్వే పనులను వేగవంతం చేయాలని వినతి



ఎంపీ హరీష్‌కు వినతి పత్రం అందిస్తున్న కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ వంతెనలు, భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధులు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కోరూతూ వినతిపత్రం అందించారు. శుక్రవారం స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో సమితి ప్రతినిధి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు ఎంపీని కలిసి రైల్వే పనులు గురించి వివరించారు. స్థానిక మున్సిపల్ సర్క్యులర్ బజార్‌లో ఉండే రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పట్టణంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయానికి తరలించారని, దానిని యథావిధిగా సర్క్యులర్ బజార్‌కు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎంపీ హరీష్‌ను సమితి ప్రతినిధులు సత్కరించి, అభినందనలు తెలిపారు. సమతి ప్రతినిధులు సప్పా నాగేశ్వరరావు, ఇసుకపట్ల రఘుబాబు, ఉప్పుగంటి భాస్కరరావు, శివాజీ, వెంకటేశ్వరరావు తదితరులు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

ఎంపీ హరీష్ మాధుర్‌కు సన్మానం

అమలాపురం రూరల్: పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కోనసీమ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.కార్ల్ డేవిడ్ కొమానపల్లి, అమలాపురం మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.మొసలి స్పర్జన్ రాజు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

కోనసీమలో రైలు కూత వినిపిస్తా

తాళ్లరేవు: ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం రాబోయే ఐదేళ్లలో కోనసీమ ప్రజలకు రైలు కూత వినిపిస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ చెప్పారు. శుక్రవారం తాళ్లరేవు అంబేడ్కర్ భవన్‌లో టీడీపీ ఎస్సీ సెల్ ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును ఎంపీ ను దళిత నాయకులు ఘనంగా సత్కరించారు .

సమస్యల పరిష్కరించాలి

అమలాపురం రూరల్: జిల్లాలోని 104 సిబ్బంది సమస్యల పరిష్కరించాలని కోరుతూ 104 ఎంఎంయూ యూనియన్ ఉద్యోగు సంఘం నాయకులు ఎంపీ హరీష్ మాధుర్ బాలయోగిని కలసి వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు వి.వంశీ,ప్రధాన కార్యదర్శి పీ.త్రిమూర్తులు ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సమర్పించే చీర, సారెతో ఆర్యవైశ్య సంఘం మహిళలు

అమలాపురం రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా బండారులంక గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అధిక సంఖ్య భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు.

ముంపు సమస్య తొలగించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలంలో కూనవరం మేజరు డ్రైన్లు ఆయకట్టు పరిధిలో ముంపు సమస్యల తొలగించాలని కోనసీమ రైతు పరిరక్షణ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కోరారు. కూనవరం మేజరు డ్రైన్లుకు అనుసంధానంగా రెండు మీడియం డ్రైన్లు, 11 మైనరు డ్రైన్లు, పంట పొలాల మధ్యలో రెవెన్యూ మురుగుబోదులు గుండా మురుగు నీరు కూనవరం మేజర్ డ్రైన్ నుంచి సముద్రంలో కలుస్తుంది. ఈ డ్రైన్లను ఆధునీకరించకపోవడంతో వర్షాకాలంలో అమలాపురం రూరల్, కాట్రేనికోన మండలాల్లో కొంత ఆయకట్టు ముగురు నీరు ముంపునకు గురవుతున్నాయి. వీటి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెవెన్యూ, మేజర్, మైనర్ డ్రైన్లను అభివృద్ధి చేసి ముంపు బారి నుంచి రక్షించాలని రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రైతులు ఎ.సత్యనారాయణ, డీఎస్‌వీఎస్ మూర్తి తదితరులు కలెక్టర్‌కు వివరించారు.